# మత్తుకు దూరం.. ప్రగతికి బాటలు



ప్రజాపక్షం / నిర్మల్ రూరల్

కలెక్టర్ భవేష్ మిశ్రా

2 లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 26 జూన్, 2026 | పేజీలు : 08

# 28 నుంచి 30వ తేది వరకు పల్స్ పోలియో

### 0 నుంచి ఐదేండ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలి

### నులి పురుగుల మాత్రలు పకడ్బందీగా పంపిణీ

### ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహించాలి కలెక్టర్ గరిమ అగర్వాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పల్స్ పోలియో, నులిపురుగుల మాత్రల పంపిణీ, సీజనల్ వ్యాధుల సన్నద్ధతపై వైద్య ఆరోగ్య శాఖ, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీతో కలిసి డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం గురువారం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. పల్స్ పోలియో పై రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్. అధికారులు ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి ఐదేండ్లలోపు పిల్లలు 41,147 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 393 వాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 38 సూపర్ వైజర్లను నియమించామని వెల్లడించారు. 15 మొబైల్ టీంలు ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీడీఓలు, మెడికల్ అధికారులతో కలిసి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి తమ పరిధిలోని 0 నుంచి ఐదేండ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో వాక్సిన్ వేయించాలని, ఈ విషయమై అన్ని విద్యాలయాలలో ప్రార్థన సమయంలో, నోటీసు బోర్డులో రాయించాలని, మహిళా సంఘాల సమావేశాల్లో దీనిపై చర్చించాలని సూచించారు. అన్ని అంగన్వాడి కేంద్రాల పరిధిలో 0 నుంచి ఐదేండ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో వాక్సిన్ అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల పరిధిలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి పిల్లలకు వాక్సిన్ వేయించాలని స్పష్టం చేశారు.

**నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలి :** జిల్లాలో ఏడాది నుంచి 19 ఏండ్లలోపు వయసు వారికి నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,33,695 మందికి జూలై (వచ్చే నెల) 13వ తేదీన వేస్తారని, అదే నెల 20వ తేదీ వరకు ఏడాది నుంచి 19 ఏండ్లలోపు వయసు వారికి అందేలా పకడ్బందీ ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని సూచించారు. లక్ష్యాన్ని పూర్తి చేసి.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

**వారంలో రెండు రోజులు డ్రై డేగా పాటించాలి :** జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డేగా పాటించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డెంగీ వ్యాప్తి చేసే దోమలు నిలువ ఉన్న మంచి నీటిలో పెరుగుతాయని తెలిపారు. వానాకాలం నేపథ్యంలో మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అన్ని ఇండ్లలో పాత టైర్లు, కూలర్లు, ఇతర పాత్రలు, ఇంట్లో, ఇంటి ఆవరణలో నీరు నిలువ ఉండకుండా చూడాలని సూచించారు. నిలువ నీటిని తొలగించాలని తెలిపారు. ఫాగింగ్ యంత్రాలు పూర్తి స్థాయిలో వినియోగించాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలలో పారిశుధ్య పనులు చేయించాలని, ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా,లోకేష్, వైద్యులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలి



కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు వారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సీపీడీవోలు,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ఎఫ్ ఆర్ఎస్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే ప్రతి చిన్నారికి నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గర్భిణులు, బాలింతలకు పాలు, కోడిగుడ్లు తదితర పోషకాహారాన్ని నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా అందించాలని తెలిపారు.గర్భిణీ మహిళలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి అక్కడే భోజనం చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని,వారికి పాలు,కోడిగుడ్లు తదితర పోషకాహారాన్ని నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా అందించి మాతా, శిశు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బాలింతలకు కూడా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సకాలంలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు.చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్యతో పాటు ఆటపాటల ద్వారా అభ్యాసం జరిగేలా అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే ఆహార పదార్థాలను తప్పనిసరిగా తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులకు బాలామృతంతో పాటు అందించాల్సిన

2 లో...

## ప్రజాపాలన అమలులో నిజామాబాద్ జిల్లా భేష్



**ప్రజాపక్షం,/నిజామాబాద్ :** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలులో నిజామాబాద్ జిల్లా భేష్ అని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ యోగితా రాణా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలులో జిల్లా పనితీరు ఎంతో బేషుగ్గా ఉందన్నారు. ఒ క్కొ శాఖ వారిగా ప్రభుత్వం నిర్ధేశించిన కార్యక్రమాలతో పాటు మానవీయ కోణంతో వినూత్న కార్యక్రమాలను అమలు చేశామని ఇక ముందు కూడా ఇదే స్పూర్తితో పని చేస్తూ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తేవాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ప్రజాపాలన జిల్లాస్థాయి సమీక్ష

2 లో...

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కరీంనగర్:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నాల్గవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ప్రారంభమైన ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ గీతాభవన్ చౌరస్తా మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ విద్యా సంస్థల విద్యార్థులు, నర్సింగ్, మెడికల్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం (నాటిక), అవగాహన గీతాలు ప్రజలను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి. ర్యాలీ అనంతరం కమిషనరేట్ కేంద్రంలోని 'అస్త్ర కన్వెన్షన్ హాలు' నందు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం అధ్యక్షతన విద్యార్థులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌ను విద్యార్థులకు ప్రదర్శించారు. అనంతరం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత జీవితాలు ఎలా అంధకారంలోకి వెళ్తాయి, కుటుంబాలు ఎలా నాశనమవుతాయనే విషయాన్ని కళ్ళకు కట్టింది. నర్సింగ్ విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శన ద్వారా డ్రగ్స్ రహిత సమాజంపై చక్కని సందేశాన్ని ఇచ్చారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద మహమ్మారి మాదకద్రవ్యాల దుర్వినియోగం (డ్రగ్ అబ్యూస్) అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకూడదని హితవు పలికారు. చదువుల వల్ల కలిగే ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా, స్పోర్ట్స్, శారీరక వ్యాయామం (ఫిజికల్ యాక్టివిటీ) పై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. అయితే, అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, యువతలో స్వీయ నియంత్రణ ఉన్నప్పుడే డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి, తమ జీవిత లక్ష్యాలను చేరుకోగలరని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ వీక్ లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు సిపి గౌష్ ఆలం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అధికారులు, విద్యార్థులందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'సంతకాల సేకరణ బోర్డు'పై సీపీతో పాటు ఇతర అతిథులు, అధికారులు సంతకాలు చేసి, కరీంనగర్‌ను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతామని సంకల్పించారు. ఈ సదస్సులో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి సరస్వతి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్, విజయకుమార్, యాదగిరిస్వామి,ఆంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ ఇతర పోలీస్, ఎక్సైజ్ అధికారులు వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

అన్ని పౌష్టికాహార పదార్థాలు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సూచించారు.జులై 1న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రుల సమక్షంలో సమావేశాలు నిర్వహించి, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, హాజరు, విద్యాభివృద్ధిపై వారి సూచనలు, సలహాలు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల బరువును క్రమం తప్పకుండా నమోదు చేసి ఎదుగుదలను పర్యవేక్షించాలని, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కాళిందిని,సీపీడీవోలు,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

# ప్రజాపాలన అమలులో నిజామాబాద్ జిల్లా భేష్

(మొదటి పేజీ తరువాయి)



నిర్వహించాయోగితారాణా విచ్చేసి జిల్లాలో అమలు చేసిన కార్యక్రమాలపై కలెక్టర్ ఇలా త్రిపాఠి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేయగా సీపీ సాయిచైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాల ప్రగతి నివేదికను తిలకించిన ప్రత్యేకాధికారిని యోగితారాణా, జిల్లా కలెక్టర్‌ను ఆయా శాఖల అధికారులను అభినందించారు. జిల్లాలో ఒకే రోజు 3304 ఇందిరమ్మ గృహాలలో లబ్ధిదారులచే సామూహిక గృహ ప్రవేశాలు చేయించటం, ప్రజాప్రతినిధులు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో విస్తృతస్థాయిలో శ్రమదానం నిర్వహించటం, ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సియల్ స్కూళ్లలో ఆరోగ్య శిబిరాలు, స్పెషల్ క్యాంప్‌లు చేపట్టడం, ట్రాన్స్‌జెండర్ల సమస్య పరిష్కారానికి కలెక్టర్ మానవీయ కోణంలో చొరవ చూపుతూ కృషి చేయటం తదితర కార్యక్రమాలను నిర్వహించటం స్ఫూర్తిదాయకమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 10 ప్రధాన అంశాలపై జిల్లాలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారంలో భాగంగా అన్ని శాఖలలో పెండింగ్ ఫైళ్లు పరిష్కరించామని, అరైవ్ అలైవ్‌లో భాగంగా గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులను ప్రభుత్వ బడులలో చేర్పించామని ఇతర వినూత్న కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, భుజంగరావు, సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్‌ఓ గీత, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మీ, ట్రైనీ ఆర్డీఓ సందీప్ అధికారులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరం.. ప్రగతికి బాటలు

(మొదటి పేజీ తరువాయి)

నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. మిషన్ పరివర్తనలో భాగంగా స్థానిక ధీక్ష జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ వికసిత్ భారత్‌కి పెహచాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత యాంత్రిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా యువత మత్తు పదార్థాల బారిన పడుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావడం అంటే జీవితాన్ని నాశనం చేసుకోవడమేనని, దీని నుంచి బయటపడటానికి యువత దృఢ సంకల్పంతో ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు బానిస కాకుండా, విలువైన సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని, గొప్ప శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. పేదరికం, చదువుల ఒత్తిడి, ఇతరులతో అవసరమైన పోలికల వల్లే మానసిక ఆందోళనకు గురై యువత తప్పుడు మార్గాల్లో పయనిస్తున్నారని కలెక్టర్ విశ్లేషించారు. వ్యతిరేక ఆలోచనలు రాకుండా, అభ్యాసంలో నిమగ్నమై ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలిచ్చారు. అనంతరం అందరితో కలిసి నషా ముక్త్ భారత్ (మత్తు రహిత భారత్) కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి పరశురాం, మానసిక వైద్యులు అల్లాడి సురేష్, కళాశాల ప్రిన్స్‌పాల్ వెంకటరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన సర్కారు బడి

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం ఒద్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించింది. ఎస్ హెచ్ వీ ఆర్ 2025–26 జాతీయ స్థాయి రేటింగ్‌లో ఈ ప్రభుత్వ పాఠశాల దేశవ్యాప్తంగా 23వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్రంలో 5వ ర్యాంకు సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విశిష్ట విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం గురువారం కరీంనగర్ లోని తన నివాస క్యాంపు కార్యాలయానికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించి అభినందించారు. ఒద్యారం జడ్పీహెచ్ఎస్ ఈ ఘనత సాధించడానికి వెనుక ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థుల సమిష్టి కృషి ఉందని ప్రశంసించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు లంకదాసరి మల్లయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి, 10 రోజుల చికిత్స తర్వాత గురువారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 10వేల నగదు అందజేశారు. భవిష్యత్తులో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడికి కరీంనగర్ ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయస్థాన జడ్జ్ ఎస్. శివకుమార్ యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ లో 2022లో నమోదైన కేసులో తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి నిందితుడు అనోద అఖిల్ (21), యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఇతర నిందితులు ఏ–2, ఏ–3లను నిర్దోషులుగా ప్రకటించింది. 2022 జనవరి 2న మన్నెంపల్లి గ్రామానికి చెందిన ఎడ్లెల్లి వరలక్ష్మి (19) అదృశ్యమైనట్లు ఆమె దత్తత తల్లి బోయిని రాజమ్మ ఫిర్యాదు చేయడంతో మహిళ అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితుడు అఖిల్‌తో యువతికి ప్రేమ సంబంధం ఉన్నట్లు, వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చినట్లు గుర్తించారు. అదే రోజు దేవునిగుట్ట కొండ ప్రాంతానికి తీసుకెళ్లిన అఖిల్, వివాహ విషయమై తలెత్తిన వివాదంతో ఆమెను చున్నీతో గొంతు బిగించి హత్య చేసి, మృతదేహాన్ని అక్కడే వదిలివేసి, ఆధారాలు నాశనం చేసేందుకు మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసినట్లు విచారణలో తేలింది. అనంతరం నిందితుడు పోలీసుల ఎదుట నేరాన్ని ఒప్పుకొని మృతదేహం, ఇతర ఆధారాలను చూపించాడు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు గొంతు బిగించడం వల్లే మరణం సంభవించినట్లు నిర్ధారించాయి. దర్యాప్తు అనంతరం నిందితుడు అఖిల్‌పై సెక్షన్లు 302, 201 ఐపీసీ కింద, అతని తల్లిదండ్రులపై సెక్షన్లు 302, 201 చదవవలసిన 109 ఐపీసీ కింద అభియోగ పత్రం దాఖలు చేశారు. కోర్టులోని పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిందితులకు శిక్షలుపడేలా కృషి చేస్తున్న సీసీఆర్బీ ఏసీపీ శ్రీనివాస్ జి, ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి తిమ్మాపూర్ సీఐ కె. శశిధర్ రెడ్డి, ప్రస్తుత ఎల్ఎండీ కాలనీ ఎస్‌హెచ్‌వో ఎస్.డి. అన్వర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. ప్రతాప్, సీడీవో ఎం. శంకర్ (హెచ్‌సీ), సీఎంఎస్ ఏఎస్సై ఎం.సత్తయ్య లను పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు ప్రహరీ గోడ నిర్మాణం

**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నూతన ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మరియు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం స్థానిక కార్పొరేటర్ టింకు, కార్పొరేటర్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మరియు సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతలతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మున్సిపల్ నిధులతో ఈ ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను మరింత సురక్షితంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్మాణం దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ పోలీస్ శాఖకు, మున్సిపల్ కార్పొరేషన్‌కు మధ్య ఇదే రకమైన సమన్వయం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## శాతవాహన అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** శాతవాహన విశ్వవిద్యాలయ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా అంజద్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా మీసా మాధురి, ఉపాధ్యక్షులుగా ఆర్. జ్ఞానేశ్వర్ రావు, కమల్ సింగ్, కోశాధికారిగా సాజిద్ పాషా, జాయింట్ సెక్రటరీలు: గా సంధ్య, శ్రీనివాస్, సలహాదారులు గా శ్రీకాంత్, సంతోష్, మారుతి, శేఖర్, కిషన్ ఎన్నికయ్యారు. అలాగే ఉద్యోగుల ఐక్యత, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ని, రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ , ఔట్సోర్సింగ్ సిబ్బంది నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## తడి-పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలి

### మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు నెల రోజులపాటు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున మున్సిపల్ చైర్మన్ నూగుల మల్లయ్య 13వ వార్డ్ లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించారు.ముందుగా చైర్మన్ కు కౌన్సిలర్ పోగల శ్రీకాంత్, వార్డు ప్రజలు శాలువ కప్పి స్వాగతం పలికారు.అనంతరం కౌన్సిలర్ బిద్ది పెల్లి వాడలో వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో వాడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చైర్మన్ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో 13వ వార్డులో అన్ని పనులు పూర్తి అయినప్పటికీ ఇంకా కొన్ని పనులు పెండింగ్లో ఉన్నాయని మా దృష్టి రావడం జరిగిందని అటువంటి పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామని బిద్దిపెల్లి వాడలో ఉన్నటువంటి సమస్య మున్సిపల్ కమిషనర్ మరియు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిఒక్కరు మీఇండ్లలో వెళ్లే చెత్తను తడిపొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందజేయాలని అన్నారు.కౌన్సిలర్ పోగల శ్రీకాంత్,వార్డ్ ఆఫీసర్లు గోడిసేల శ్రీనివాస్,కుమార్,బిల్ కలెక్టర్ అజయ్,ఆర్పీ భాగ్యలక్ష్మి ,అంగన్వాడీ టీచర్ శారద,ANM సంతోషి ,శానిటేషన్ సిబ్బంది రవి,వార్డు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.



## గంగాధరలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం

### డాగ్ స్క్వాడ్‌తో హాస్టల్ తనిఖీ

ప్రజాపక్షం/గంగాధర: మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు యువతలో అవగాహన పెంపొందించేందుకు గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో గంగాధరలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే బాలుర పాఠశాల మరియు మధురానగర్‌లోని తెలంగాణ మోడల్ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి నివారణలో యువత పాత్ర, ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్స్ అంశంపై పోస్టర్ తయారీ, నినాదాల రచన, కవితా పోటీలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాగ్ స్క్వాడ్ బృందంతో కలిసి బాలుర హాస్టల్ గదుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, హాస్టల్ పరిసరాలు మరియు గదులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. విద్యాసంస్థలు, హాస్టళ్లలో మాదక ద్రవ్యాలకు తావు లేకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని ఎస్సై గారు




తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సాంస్కృతిక సృజనాత్మక కార్యక్రమాల వైపు దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు. పాఠశాలప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృంద సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ నుంచి ఆపరేషన్ కగార్ కోసం పౌరహక్కుల ఉల్లంఘనే

### పౌరహక్కుల సంఘం రౌండ్ టేబ్ సమావేశం

ప్రజాపక్షం/పెద్దపల్లి : 1975లో విధించిన ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని,పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో గురువారం రౌండ్ టేబ్ సమావేశం నిర్వహించారు.ఇందిరా ఎమర్జెన్సీ నుండి మోడీ ఆపరేషన్ కగార్ వరకుపౌరహక్కుల ఉల్లంఘనలు అనే అంశంపై జరిగిన ఈ సమావేశానికి పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ 1975 నాటి ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయమని పేర్కొంటూ,అప్పట్లో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసి,వేలాది మంది రాజకీయ నాయకులు,కార్యకర్తలను జైలుపాలు చేసిన ఘటనలను గుర్తు చేశారు.ప్రస్తుతం దేశంలో అటువంటి నిర్బంధ ధోరణులే భిన్న రూపాల్లో కొనసాగుతున్నాయని,కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేస్తూ,భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారిని దేశద్రోహులుగా,ఉగ్రవాదులుగా ముద్రవేస్తూ అణచివేస్తోందని వారు విమర్శించారు.ముఖ్యంగా ఆపరేషన్ కగార్ పేరుతో ఆది



వాసీ ప్రాంతాల్లో చేపట్టిన సైనిక చర్యలు స్థానిక ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని వారు మండిపడ్డారు.దేశంలో దళితులు, ఆదివాసీలు,మైనారిటీలు మరియు మహిళలపై పెరుగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన వక్తలు, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ,ప్రజలు,మేధావులు, విద్యార్థి, యువజన మరియు మహిళా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని వారు కోరారు. అంజన్న,సీఎల్సీ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిరాజుల సంపత్,జిల్లా ఉపాధ్యక్షులు నారా వినోద్,బండారి రాజలింగు,టీపీఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు జైపాల్ సింగ్,సామాజిక ఉద్యమకారులు ఎరుకల రాజన్న,ప్రజా సంఘాల నాయకులు రామిల్ల బాపు, యాదన్న,సమ్మన్న,దస్తగిరి, శంకరయ్య, పొలాస సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

ప్రజాపక్షం/రామగిరి : రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని సి.ఎన్.సి.ఓ.వి క్లబ్ నందు గురువారం గుర్తింపు సంఘం (ఏఐటియుసి) డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు అధ్యక్షతన నిర్వహించిన 20వ ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.సమావేశంలో భాగంగా ముందుగా ఎస్ ఎం ఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.శంకర్ గత త్రైపాక్షిక సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏరియాలో, అదేవిధంగా సింగరేణి సంస్థ వ్యాప్తంగా గత కొద్ది సంవత్సరాలుగా జరిగిన వివిధ రకాల ప్రమాదాల గణాంకాలను తెలియజేశారు. ఏరియాలో ప్రమాదాలు జరగకుండా భద్రతా పరంగా వివిధ గనులు, విభాగాలలో తీసుకుంటున్న చర్యలను ఎస్వోటు జియం బండి సత్య నారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.తదుపరి వివిధ గనుల వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు వారి తనిఖీలో దృష్టికొచ్చిన విషయాలను తెలియజేశారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ తరఫున హాజరైన అధికారులు మాట్లాడుతూ వారి తనిఖీలో దృష్టికొచ్చిన అంశాలు తెలియజేసి, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.అనంతరం రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా కొలిపాక నాగేశ్వరరావు లు మాట్లాడుతూ డి.జి.ఎం.ఎస్. అధికారులు అందించిన సూచనలు తప్పకుండా పాటిస్తామని, భద్రతాపరంగా లోటు పాట్లు రాకుండా చూస్తామని, అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు. తదుపరి గనుల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ వారి రోజూ వారి విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేవని, పని ప్రదేశాల్లో ఏర్పాట్లుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్ మాట్లాడుతూ భద్రతా పరంగా యాజమాన్యం తీసుకునే నిర్ణయాలకు వారి సహకారం తప్పకుండా ఉంటుందని అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ యం.మల్లయ్య, రెస్క్యూ విభాగం జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థను ప్రమాదరహిత సంస్థగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం డి.ఎం.ఎస్.(మైనింగ్) డాక్టర్ సాగేష్ కుమార్ మాధవన్ రామచంద్రన్ మాట్లాడుతూ భద్రత పట్ల నిర్లక్ష్యం చేయొద్దని, పని ప్రదేశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రమాదాల నియంత్రణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భద్రత విషయంలో వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ల పాత్ర కీలకమని, విషయాలను యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రమాదరహిత వాతావరణం కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా సదుపాయాలపై



దృష్టి పెట్టాలని, సౌకర్యాలలో ఎలాంటి లోటు పాట్లు తలెత్తకుండా చూడాలని, అందరు కలిసి కట్టుగా విధులు నిర్వహిస్తున్న జీరో హామ్ ఎలాంటి ప్రమాదం జరుగకుండా ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు.ఉద్యోగుల భద్రత పట్ల నిర్లక్ష్యం చేయకుండా, ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డిడి యంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్ ప్రభాకర్, డిడి యంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి,డిడిఎంఎస్ (మెకానిక్) డాక్టర్ కౌశిక్ సేన్ గుప్తా, ఎస్వోటుజియం లు బండి సత్యనారాయణ, యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్లు ఉదయ భాస్కర్, దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు రాజశేఖర్, ప్రవీణ్ వి ఫాటింగ్, వివిధ గనుల మేనేజర్లు,ప్రాజెక్ట్ ఇంజనీర్లు,విభాగాల అధిపతులు, అధికారులు,సేఫ్టీ ఆఫీసర్లు, సంక్షేమ అధికారులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు, మహిళా ఉద్యోగులు,కాంట్రాక్టర్ల ప్రతినిధులు,కార్మిక సంఘాల నాయకులు,ప్రాజెక్ట్,

## 27న వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహణ

### జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో, భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ,స్కిల్ ఇండియా మిషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ కౌశల్ మహోత్సవం 2026జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 27, 2026న వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (KITS) ప్రాంగణంలో ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడుతుందని, ఈ జాబ్ మేళాలో 50కి పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని, దీని ద్వారా సుమారు 5,000కు పైగా ఉద్యోగ ఖాళీలు, డ్యూయల్ స్కిల్లింగ్, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కెరీర్/నైపుణ్యాభివృద్ధి కోర్సుల మార్గదర్శకత్వం లభిస్తాయని, పదవ తరగతి, ఇంటర్మీడియట్, అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన అభ్యర్థులుసద్వినియోగం చేసుకోవాలని,ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 88000 55555 ,8001239626 నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పెద్దపల్లిలో ఉచిత కంటివైద్య శిబిరం

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గల సవేర ఆప్టికల్స్/లయన్స్ విజన్ సెంటర్ లో లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఆధ్వర్యంలో క్లబ్ కార్యదర్శి మరియు అప్తాల్మిక్ ఆఫీసర్ Ln.అబ్దుల్ వాసే సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం అత్యాధునిక పరికరాలతో ప్రతి గురువారం రోజున విజయవంతంగా నిర్వహిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఐ క్యాంప్స్ డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్ Ln.పూదరి దత్తాగౌడ్ తెలిపారు.కంటిలో పొర ఉన్నవారికి ఉచిత రవాణా భోజన వసతులతో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు.జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 15వ వార్డు సమస్యలను పరిష్కరించండి

### మున్సిపల్ కమిషనర్ ను కౌన్సిలర్ రాకేష్ వినతి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : 15వ వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని పెద్దపెల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ కు కౌన్సిలర్ పెంజర్ల రాకేష్ విన్నవించారు.భారీ వర్షం పడినప్పుడు స్కూల్ పిల్లలకి బ్రిడ్జి దాటలేక స్కూలుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని కమిషనర్ వివరించడం జరిగిందని,కమిషనర్ వెంటనే మరమ్మత్తులు చేపట్టి ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని,రానున్న వర్షాలు నేపధ్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వార్డు ప్రజలు తమ ఇండ్లలో వెళ్లే చెత్తా ప్లాస్టిక్ కవర్లను డ్రైనేజీలో వేయవద్దని,డ్రైనేజీలో చెత్త వేయడం వల్ల మురికి నీరు నిలిచిపోయి దోమలు వ్యాపించి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వార్డు ప్రజలకు తెలిపారు. వాట్ ఆఫీసర్లు సురేష్,అరవింద్ మున్సిపల్ అధికారులు రమాకాంత్,రాజు,15వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వివాహ నిశ్చితార్థ వేడుకల్లో :తోట్ల

ప్రజాపక్షం/రామగిరి : గురువారం రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సింగరేణి కమిటీ హాల్లో, నాగేపల్లి గ్రామానికి చెందిన బొడ్డు కనుకయ్య ద్వితీయ పుత్రిక వివాహ నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కాబోయే వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్లే రామ్మూర్తి ,మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్కకొమురయ్య గౌడ్ ,సర్పంచులు తీగల సమ్మయ్య , ఎరుకల బాబురావు , రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం,గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య,వార్డు సభ్యులు శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్ విజయవంతం

ప్రజాపక్షం/రామగిరి : బుధవారంపేటలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా రేకుర్తి కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకున్న లబ్దిదారులు గురువారం స్వగ్రామానికి చేరుకోగా వారికి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు లయన్. డా. శరణ్య యాదవ్, ఉపాధ్యక్షులు లయన్. బుద్దార్తి బుచ్చన్న, ఐ విజన్ ప్రోగ్రామ్ ఇంచార్జ్ లయన్. గంట వెంకటరమణ రెడ్డి, బుధవారం పేట గ్రామ సర్పంచ్ కన్నూరి రవీందర్, ఉప సర్పంచ్ బుద్దార్తి విజయ తదితరులు లబ్దిదారులను కలిసి అభినందించారు అనంతరం వారికి బ్రెడ్ ప్యాకెట్స్ అందజేశారులయన్స్ క్లబ్ జిల్లా కమిటీ చైర్ పర్సన్ మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ, కంటి ఆపరేషన్ పొందిన వారికి ఉచిత రవాణా, వైద్య సేవలు, ఆపరేషన్, మందులు ఇతర అన్ని సౌకర్యాలను పూర్తిగా ఉచితంగా అందించామని తెలిపారు.

## విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారానికే..బోరు బావి

### సర్పంచ్ గడ్డం రాజేశం

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని జిల్లెల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకే ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో బోరు బావిని ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ గడ్డం రాజేశం అన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాజేశం మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు బోరుబావిని ఏర్పాటు చేశామని అలాగే కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు,ముత్తారం మండల మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం మార్గదర్శకత్వంలో ఈ బోరు వేపించడం జరిగిందన్నారు.పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం, ముత్తారం మండల కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ వినీత్,ఉప సర్పంచ్ శ్రీవాణి ప్రవీణ్, పాటు వార్డు సభ్యులు గడ్డం గట్టయ్య,రుద్రవీణ రేవతి శంకర్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పన్నాల సురేష్,శ్రీకాంత్,రవితేజ,పందుల రాజయ్య,జన్ని రామచందర్,జన్ని గంగారాం,గడ్డం రఘుపతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని బోరు బావి పనులను పర్యవేక్షించారు. పాఠశాలలో బోరు వేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు నరకం!

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం నిలువెత్తు రూపం దాల్చింది.వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రజలు,రైతులు అంధకారంలో మగ్గిపోవాల్సి వస్తోంది. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభానికి ముందే వ్యవసాయ,అంతర్గత విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలనే కనీస న్యాయమైన్ని అధికారుల్లు గాలికొదిలేశారు. పనులేవీ మాకు పట్టవు అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తుండటంతో, మండలంలో నిత్యం ఎక్కడో ఒకచోట విద్యుత్ అంతరాయం ఏర్పడుతూనే ఉంది.ప్రజల నుండి నయా పైసాతో సహా విద్యుత్ బిల్లులు వసూలు చేయడంలో చూపిస్తున్న ఉత్సాహం..న్యాయమైన విద్యుత్ సరఫరా చేయడంలో ఎందుకు కరువైందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు... పొంచివున్న ప్రాణాపాయం..! ముత్తారం మండల పరిధిలోని పారుపల్లి, కేశనపల్లి,అడవి రాంపూర్,ఓడేడు సబ్ స్టేషన్ల పరిధిలో గల 11 కేవీ లైన్ల కింద పెరిగిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.

**రోడ్డు ఎత్తు పెరిగింది .. ప్రమాదం ముంచుకొచ్చింది :** ఇటీవల గంగపురి నుండి ఓడేడు వరకు నూతనంగా నిర్మించిన రోడ్డు కారణంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పుడు చేతికి అందేంత ఎత్తులోకి వచ్చేశాయి.

**పట్టించుకోని యంత్రాంగం :** కనీసం హై లెవెల్ గద్దెలు (ప్లాట్‌ఫామ్స్) నిర్మించి, వాటిపై ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలనే కనీస ఆలోచన కూడా అధికారులకు లేకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. ఎప్పుడు ఏ అపశ్రుతి జరుగుతుందోనని స్థానికులు భయాందోళనల మధ్య బతుకుతున్నారు.

# ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారం నింపాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఓటర్ జాబితాలో ఉన్న వారందరూ ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలని, ఫారం, ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫోటో బీఎల్ఓలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎస్ఐఆర్ పై జిల్లాలోని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బూత్ లెవెల్ అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ అనేది చాలా ప్రత్యేకమని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితాలో ఉన్న వారందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని సూచించారు.ఫారాలు నింపడంలో సహాయం చేయాలని తెలిపారు. ప్రతి ఓటర్ తమ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు. బీఎల్ఓ లకు ఫారాలు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు వచ్చేనెల జూలై 24వ తేదీలోగా ఇవ్వాలని సూచించారు. ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, బీ ఎల్ ఓ సూపర్ వైజర్లు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని తెలిపారు. బీ ఎల్ ఓ లు తమకు అందించిన సామగ్రి, ఐడీ కార్డుతో తమ పరిధిలోని ఇండ్లకు బీఎల్ఓలతో కలిసి వెళ్లాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం, ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలి

### సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం యాంటీ–డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతినగర్ నుండి గాంధీ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌరస్తా వద్ద విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరిస్తూ నాటికలు ప్రదర్శించారు. ఈసందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలపై విద్యార్థులకు , ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు సంబంధించిన చట్టపరమైన శిక్షలను వివరించారు.చెడు స్నేహితుల ప్రభావం, సామాజిక ఒత్తిళ్ల యువతను డ్రగ్స్ వైపు మళ్లించే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం విద్య, భవిష్యత్ కెరీర్, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111 కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ 14వ వార్డ్ కౌన్సిలర్ వెంగళ లీల లక్ష్మీ నారాయణ, ఎస్ ఐ లు నాగరాజు, గణేష్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై హన్మాజీపేట విద్యార్థిని బుర్ర తపస్వి అద్భుత ప్రసంగం

### ప్రత్యేకంగా అభినందించిన వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు

**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన యాంటీ–డ్రగ్ అవేర్‌నెస్ సదస్సులో తొమ్మిదో తరగతి విద్యార్థిని బుర్ర తపస్వి మాదకద్రవ్యాల నివారణపై గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అద్భుతంగా ప్రసంగించింది. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ.. డ్రగ్స్ మహమ్మారి యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. క్షణకాలం పాటు ఇచ్చే కిక్ కోసం అలవాటు పడే ఈ వ్యసనం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోతుందని, మెదడు పనితీరు మందగించి జ్ఞాపకశక్తి దెబ్బతింటుందని తెలిపింది. ఒక వ్యక్తి డ్రగ్స్‌కు బానిసలైతే కేవలం ఆ వ్యక్తి మాత్రమే కాకుండా, వారి నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడుతుందని, సమాజంలో గౌరవాన్ని కోల్పోతారని వివరించింది. చదువుకోవాల్సిన వయసులో ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని తోటి విద్యార్థులకు పిలుపునిచ్చింది. ఆమె ప్రసంగించిన తీరుకు, మాదకద్రవ్యాలపై ఉన్న అవగాహనకు ముగ్ధులైన వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు విద్యార్థిని బుర్ర తపస్వినిని ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకటరాజం, అధ్యాపక బృందం, గ్రామ ప్రజాప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్లు ఉన్న ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

**ప్రజాపక్షం /ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం పరిధిలో పరిశీలన–ఓటర్లు ఉన్న ప్రతి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎస్ఐఆర్ లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 71 వ పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ లెవల్ అధికారి ఎన్యూమరేషన్ ఫారాలు గురువారం పంపిణీ చేస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకున్న పలువురితో మాట్లాడారు. ఎన్యూమరేషన్ ఫారంలో అన్ని వివరాలు నింపాలని, ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో బీఎల్ఓలకు ఇవ్వాలని సూచించారు. ఈ నెల 30 వ తేదీ వరకు తమ పరిధిలో ఓటర్ జాబితాలో ఉన్న వారందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని ఆదేశించారు. జూలై 24వ తేదీలోగా తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఫారాలు నింపడంలో సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ సుజాత తదితరులు ఉన్నారు.



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి.. హానికరమైన విషయాలకు ధైర్యంగానో చెప్పండి



**ప్రజాపక్షం /ఎల్లారెడ్డిపేట:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా,ఈరోజు ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై–2 రజాక్ గారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని, కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు.సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై,క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ వ్యసనాల కారణంగా కొందరు దొంగతనాలు వంటి నేరాలకు కూడా పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అందువల్ల యువత చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను కూడా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తమకు నచ్చని లేదా హానికరమైన విషయాలకు ధైర్యంగా “నో” చెప్పడం నేర్చుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే “నో” చెప్పే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు.ఎల్లారెడ్డిపేట ఎస్సై–2 రజాక్ గారు, బాబయ్య కానిస్టేబుల్, ప్రిన్సిపల్ టీచర్స్,విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని రామకృష్ణాపూర్ సర్పంచ్ తాని ప్రభాకర్ సోదరుని కుమారుడు రాకేష్ రవళిల వివాహ వేడుకలు గురువారం ఘనంగా జరిగింది.ఈ వివాహ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు,ముత్తారం మండల మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కళ్యాణ వేదికపై నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి,వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజీద్ పాషాతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని జిల్లెళ్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి జన్ని సుధాకర్,ప్రభాకర్, రాజేందర్‌ల తండ్రి అయిన దివంగత గంగారం ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించగా గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం,ఉప సర్పంచ్ శ్రీవాణి ప్రవీణ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి,మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వీరితో పాటు వార్డు సభ్యులు గడ్డం గట్టయ్య,సిద్ద సమ్మయ్య,జొన్న రామచందర్,నారాయణ రాజు గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## వర్షాల కోసం గ్రామదేవతలకు జలాభిషేకం



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలో గురువారం గ్రామకమిటీ ఆధ్వర్యంలో వర్షాలు బాగా కురవాలని వేడుకుంటూ రైతులు, ప్రజలు, గ్రామదేవతలకు జలాభిషేకాలు చేశారు. వర్షాలు కురిసి చెరువులు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలతో సుఖంగా ఉండాలని కోరుకుంటూ రైతులు, ప్రజలు నీళ్ల బిందెలు ఎత్తుకొని ఆలయాలకు చేరుకుని విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నివారణపై ర్యాలీ



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు ఎస్సై సిహెచ్.సతీష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల, ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో మత్తు పదార్థాల నివారణపై ర్యాలీ, మానవహారం నిర్వహించి ఎఎస్సై వెంకట్ మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా ఆ సమాచారం తమకందిస్తే చర్యలు తీసుకుంటామని, సమాచారమందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలి

ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ : నిర్మల్ మండలంలోని న్యూ పోచంపాడు గ్రామంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు గ్రామస్తులు ఒక వినూత్నమైన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని పిల్లలెవరూ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా అందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గ్రామస్తులంతా కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండ పద్మ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తీర్మానాన్ని ఉల్లంఘించి ఎవరైనా తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపించినట్లయితే గ్రామ నియమావళి ప్రకారం వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ఏలాంటి సంక్షేమ పథకాలు వర్తింపజేయడం జరగదని స్పష్టం చేశారు. గ్రామ ఉమ్మడి నిర్ణయానికి అందరు కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమేష్, వార్డు సభ్యులు వీడీసీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

### డీఎం అండ్ హెచ్ఓ డా. నరేందర్ రాథోడ్



ప్రజాపక్షం / మంచిర్యాల : మంచిర్యాల పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంతో పాటు తెలంగాణ దయాగ్నొస్టిక్స్ కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, శిశు సంరక్షణలో తీసుకుంటున్న జాగ్రత్తలపై ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, స్పెషలిస్ట్ వైద్యులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఆసుపత్రిలోని హెల్ప్ డెస్క్ ద్వారా దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు ఎంతో సహాయం అందుతుందని, గర్భవతులు, వారి కుటుంబ సభ్యులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని, మే నెలలో కేంద్రంలో 342 ప్రసవాలు జరగ్గా, అందులో 137 సాధారణ ప్రసవాలు, 205 సిజేరియన్లు అయ్యాయని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు గర్భవతులకు అన్ని పరీక్షలు చేసి మాతా శిశు సంరక్షణ కార్డులు నమోదు చేసి పంపించాలని, ఎక్కువ ముప్పు ఉన్న గర్భవతుల వివరాలను హెల్ప్ డెస్క్‌కు తెలియజేయాలని ఆదేశించారు. స్త్రీ, శిశు వైద్య నిపుణుల ద్వారా అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డాక్టర్ స్వాతి, రాజమణి, నర్సింగ్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో విజయవంతం చేయాలి

### డాక్టర్ మేజర్ మురళి క్రిష్ణ



ప్రజాపక్షం / జైనూర్ : 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మేజర్ మురళి క్రిష్ణ పిలుపునిచ్చారు. జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చూడాలన్నారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 28న ఏర్పాటు చేసే పోలియో బూత్‌ల వద్ద సున్నా నుండి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా చుక్కలు వేయడమే లక్ష్యమని, ముఖ్యంగా బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, చర్చిలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు పనిచేసి ఒక్క చిన్నారి కూడా మిగలకుండా గుర్తించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పోలియో బూత్‌లకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. అనంతరం 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి బూత్‌లకు రాని చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# కొఠారిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం



ప్రజాపక్షం / కెరమెరి : వర్షాకాలం నేపథ్యంలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కొఠారి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కొఠారి గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ చౌరస్తా ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువల్లో నీరు నిలువ లేకుండా జెసిబి సహాయంతో పూడిక తీయించి, చెత్తను తొలగించడంతో పాటు నూతన మట్టి కాలువలు తీయించే కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. గ్రామసర్పంచ్ మాడవి శాంతాబాయి, పంచాయతీ కార్యదర్శి తిరిసుంగూలీ సతీష్ స్వయంగా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాడవి శాంతాబాయి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి వార్డులో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలు కూడా డ్రైనేజీలలో, ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకుండా పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ పనుల్లో పంచాయతీ కార్యదర్శి తిరిసుంగూలీ సతీష్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# బురదమయంగా దుబ్బగూడ ప్రధాన రహదారి



ప్రజాపక్షం / సిర్పూర్ టి : సిర్పూర్ టి మండలంలోని దుబ్బాగూడ వద్ద ప్రధాన రహదారి బుధవారం కురిసిన వర్షానికి పూర్తిగా బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై పెద్ద ఎత్తున నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రజలు ఈ దారిలోనే ప్రయాణించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఈ రహదారి గుంతలతో నిండిపోవడం, బురదమయంగా మారడం వల్ల ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనుల కోసం వెళ్లే రైతులు, అత్యవసర అవసరాల నిమిత్తం వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుబ్బాగూడ వద్ద ఉన్న ఈ ప్రధాన రహదారి చాలా కాలంగా దెబ్బతిన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పుడల్లా ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి దుబ్బాగూడ ప్రధాన రహదారిని వెంటనే మరమ్మతులు చేయించి, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన మేనేజర్‌గా వై. అనిల్

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖ నూతన మేనేజర్‌గా వై? అనిల్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ శాఖ మేనేజర్‌గా విధులు నిర్వహించిన జాడే కృష్ణ నీల్వాయికు బదిలీ కాగా, మంచిర్యాల శాఖ నుంచి బదిలీపై వచ్చిన వై. అనిల్ కొత్త మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన శాఖ మేనేజర్ వై. అనిల్ మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఖాతాదారుడికి వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ, బ్యాంకు పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సహకారంతో శాఖ అభివృద్ధికి పాటుపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా శశిధర్ ఏకగ్రీవం



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షునిగా నాగాపూర్ ఉపసర్పంచ్ ఉల్లెంగల శశిధర్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఆర్‌ఆర్ నగర్ ఉపసర్పంచ్ డి.ప్రసాద్, కార్యదర్శిగా హాసకొత్తూర్ ఉపసర్పంచ్‌గా ఏనుగు మనోహర్‌రెడ్డి, సలహాదారుడుగా నర్సాపూర్ ఉపసర్పంచ్ కట్ట రాజకుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా శశిధర్ మాట్లాడుతూ మండలంలోని ఉపసర్పంచ్‌లందరిని ఒకే వేదికపైకి తీసుకవచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు కొత్తపల్లి అశోక్, ఎం.అనిల్, ఉదయ్, శేఖర్, భూమేశ్వర్, శంకర్, నరేష్, రమేష్, శంకర్, విశాల్ పాల్గొన్నారు.

## బాధితుడికి ఎల్ఓసి అందజేత



ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన బనావత్ పత్తి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేరిన నేపథ్యంలో వైద్య ఖర్చుల కోసం రూ.1,50,000 లు ఎల్ఓసి(లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. ఈ మేరకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఎల్ఓసి కాపీని రోగి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా త మ చికిత్సకు ఎల్ఓ సి మంజూరు చేయించి ఇచ్చిన ఎమ్మెల్యేకు బనావత్ పత్తి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## యువకులు మంచి మార్గాన్ని ఎంచుకోవాలి

ప్రజాపక్షం / ముథోల్ : ముథోల్ యువకులు మంచి మార్గాన్ని ఎంచుకుని రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని ముథోల్ గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు. గురువారం సమస్త గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఇటీవల ప్రకటించిన భారత నౌకాదళం (నేవీ) నియామక ఫలితాల్లో ఉద్యోగానికి ఎంపికైన ముథోల్ గ్రామానికి చెందిన కారగిరి సాయినాథ్ రుక్మా దంపతుల కుమారుడు కారగిరి సాయికుమార్‌ను ఘనంగా అభినందించి సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో తాలూకా సంఘం అధ్యక్షులు రోళ్ళ రమేష్, వీడిసి అధ్యక్షులు పెద్దోళ్ళ విఠల్, ఉపాధ్యక్షులు పల్లోళ్ళ నాగేష్, కోశాధికారి వెంకటేష్, సహాయ కార్యదర్శి దశరథ్, మాజీ ఉప సర్పంచ్ గడ్డం సుభాష్, ఉత్సవ కమిటీ కోశాధికారి రోళ్ళ బాలాజీ, ఉపాధ్యక్షులు ప్రవీణ్, అడ్వకేట్ సోమేష్ పటేల్, మున్నూరు కాపు పట్టణ అధ్యక్షుడు లవన్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గోసుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్‌తో ఆవు మృతి

నష్టపరిహారం కోరుతున్న రైతు



ప్రజాపక్షం/పెంబి : పెంబి మండలంలోని వెంకంపోచంపాడ్ (పోచంపల్లి) గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ ఆవు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రాథోడ్ సవాయిరామ్‌కు చెందిన ఆవు గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది. జీవనాధారంగా ఉన్న పశువు మృతి చెందడంతో కుటుంబ ఇబ్బందులు ఎదుర్కొంకోవడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఘటనపై స్పందించి తనకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రాథోడ్ సవాయిరాం కోరాడు. గ్రామస్థులు కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ, విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్.ఐ.ఆర్




ప్రజాపక్షం/పెంబి : పెంబి మండలంలోని శెట్టిపెల్లి గ్రామ పంచాయతీలో ఎమ్మార్వో ధ్రువ లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రత్యేక విస్తృత సవరణ లేదా ఎస్.ఐ.ఆర్ అనేది భారత ఎన్నికల సంఘం ద్వారా ఓటర్ల జాబితాను సరిచూచి సవరించడానికి చేపట్టే ఒక ప్రక్రియ అని వేగవంతమైన పట్టణీకరణ అధిక స్థాయి వలసలు కొత్త అర్హతల గల ఓటర్ల చేరిక నివేదించని మరణాలు మరియు విదేశీ అక్రమ వలసదారుల పేర్లను తొలగించడం వంటి కారణాల వల్ల ఎన్నికల జాబితాను సవరించడం ప్రత్యేక ఇంటర్వ్యూ రివిజన్ యొక్క ముఖ్య ఉద్దేశం అని ఎమ్మార్వో ధృవ లక్ష్మణ్ వివరించడం జరిగింది. అదే విధంగా బి.ఎల్.ఓ.లు బూతు ఆఫీసర్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ తమకు కేటాయించిన బూతు లెవల్ పరిధిలో ఇంటింటికి తిరిగి జాగ్రత్తగా ఓటర్లని కలిసి పూర్తి సమాచారం సేకరించాలి. తమకు ఇచ్చిన గడువులోగా ఓటర్ సర్వే పూర్తి చేయాలని ఎమ్మార్వో ధ్రువ లక్ష్మణ్ బీ.ఎల్.ఓ.లకు సూచిచండం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు మధ్యవాడు విఠల్ , సిడం శశికళ శంకర్, ఆత్రం లింగు, పంచాయతీ కార్యదర్శి రమేష్, జీవిఓ గణేష్, బి.ఎల్.ఓ.లు రాణి , మాధవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి వచ్చే వారికి శుద్ధ జలాన్ని అందించాలి

జిల్లా కలెక్టర్ కె హరిత



ప్రజాపక్షం/కాగజ్ నగర్ : వైద్య చికిత్సల కొరకు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు శుద్ధ జలాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. కాగజ్ నగర్ పట్టణంలోని ఎల్లా గౌడ్ తోటలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో హైదరాబాద్‌కు చెందిన పవర్ మెక్ ఇండస్ట్రీ వారు అందించిన రివర్స్ ఆస్మోసిస్ నీటి ప్లాంట్‌ను ఆసుపత్రి పర్యవేక్షకులతో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలలో భాగంగా రివర్స్ ఆస్మోసిస్ నీటి ప్లాంట్‌ను అందించడం అభినందనీయమన్నారు. ఈ వాటర్ ప్లాంట్ ప్రతిరోజు పనిచేసేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 11వ వార్డు బాలాజీ నగర్‌లో బూత్ స్థాయి అధికారులు పంపిణీ చేస్తున్న ఓటర్ల గణన పత్రాల ప్రక్రియను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు ఈ గణన పత్రాలను అందించి, నింపిన తర్వాత తిరిగి సేకరించి యాప్‌లో స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన ర్యాలీ




ప్రజాపక్షం/జన్నారం : మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జన్నారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం యాంటీ డ్రగ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోనకల్ రామాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ జన్నారం బస్ స్టాండ్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ జి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ ర్యాలీలో మండలంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

తెలంగాణ రాష్ట్ర ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి



ప్రజాపక్షం/కాగజ్ నగర్ : విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. కాగజ్ నగర్ డివిజన్‌లో గురువారం పర్యటించిన ఆయన పలు విద్యుత్ మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. దహెగాం నుండి బెల్లంపల్లి డివిజన్ కన్నెపల్లి మధ్య ఇరవై కిలోమీటర్ల ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను పరిశీలించి, ఈ లైన్ వారంలో అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దహెగాం, పెంచికల్ పేట్ పరిసర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడం ద్వారా భారీ వర్షాలు, ఈదురు గాలుల సమయంలోనూ అంతరాయం లేకుండా చూసుకోవచ్చన్నారు. బెజ్జూర్, దహెగాం, కౌటాల, సిర్పూర్ టి సబ్ స్టేషన్లను సందర్శించి మరమ్మతు పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రతా పరికరాలు లేకుండా పనిచేయవద్దని, లైన్ క్లియరెన్స్ యాప్ ద్వారానే ఎల్సీలు తీసుకోవాలని హెచ్చరించారు. పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి ఒక నిమిషం సమయం తీసుకుని భద్రతా ప్రమాణాలను పరిశీలించాలన్నారు. ప్రమాదభరితంగా ఉన్న లైన్లు, వంగిన స్తంభాలను సరిచేయాలని, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలను పెంచాలని ఆదేశించారు. అటవీ ప్రాంతమైన వేంపల్లి నుండి పెద్దబండ, సారసాల నుండి ఎల్కపల్లి వరకు పంతొమ్మిది కిలోమీటర్ల మేర కవర్డ్ కండక్టర్ పనులు కొనసాగుతున్నాయని, దీనివల్ల చెట్లు విరిగిపడినా అంతరాయం కలగదన్నారు. బెజ్జూర్ నుండి కర్జవల్లి వరకు ఇరవై కిలోమీటర్ల ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను వారం లోపల పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డివిజనల్ ఇంజనీర్ సి నాగరాజు, టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకంగా సింగరేణి క్వార్టర్ల కేటాయింపు



ప్రజాపక్షం/మందమర్రి : సింగరేణి మందమర్రి ఏరియాకు చెందిన జాతీయ బొగ్గు వేతన ఒప్పంద ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపులో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ గురువారం స్థానిక సిఈఆర్ క్లబ్‌లో సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగుల సంక్షేమం, గృహ వసతి కల్పన లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రక్రియను అధికారులు నిబంధనలకు అనుగుణంగా చేపట్టారు. మందమర్రి ఏరియాలో మొత్తం 109 క్వార్టర్లు అందుబాటులో ఉండగా వాటి కేటాయింపుకు 175 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సీనియారిటీ ఆధారంగా అర్హత కలిగిన ఉద్యోగులను ఎంపిక చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో తొలి విడతగా 27 మంది ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించారు. క్వార్టర్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమక్షంలోనే కౌన్సెలింగ్ నిర్వహించి కేటాయింపు ప్రక్రియపై పూర్తి స్పష్టత కల్పించారు. భవిష్యత్తులో కూడా నిబంధనల మేరకు పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ పర్సనల్ అధికారి జివిఎల్ ప్రసాద్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ విజయ్ సందీప్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, పర్సనల్ డిపార్ట్‌మెంట్ ఓఎస్ రాజలింగు, మేనేజ్‌మెంట్ ట్రైనీ సివిల్ ఆర్ వీణ, పర్సనల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ జూనియర్ లెక్చరర్ల సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాపక్షం/నేరడిగొండ : ప్రభుత్వ ఇంటర్ విద్య పరిరక్షణలో భాగంగా నియమితులైన 2023 బ్యాచ్ జూనియర్ లెక్చరర్ల హక్కుల సాధనకై రాష్ట్ర కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ఈ నెల 26న హనుమకొండలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్ల ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ఇంటర్ విద్యలో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో సేవలందిస్తున్నామని, అనేక పోరాటాల అనంతరం 2023లో జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించడం జరిగిందన్నారు. అయితే వీరికి ఇంక్రిమెంట్లు వంటి ప్రయోజనాలు అందకుండా పోయాయని, సర్వీస్ పూర్తయినప్పటికీ సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారానికై రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని జూనియర్ లెక్చరర్లు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# పొనకల్‌లో ఇంటింటి సర్వే



ప్రజాపక్షం/జన్నారం: జన్నారం మండలంలోని పొనకల్ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కుటుంబ సభ్యుల వివరాలు, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సిబ్బంది సమాచారం సేకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు అవసరమైన సమాచారాన్ని సమీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే బృందాలకు గ్రామస్తులు పూర్తి సహకారం అందించి, సరైన వివరాలు ఇవ్వాలని సూచించారు. గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని చేరుకునేలా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా



ప్రజాపక్షం/భైంసా : జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో భైంసా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం గృహ సముదాయాలను సందర్శించి వాటి ప్రస్తుత స్థితిగతులను పరిశీలించారు. ఈ వారాంతంలో జరగనున్న మంత్రి పర్యటన సందర్భంగా అర్హులైన లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు భైంసా మున్సిపాలిటీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మెన్ దత్తాద్రి, మున్సిపల్ కమీషనర్ సిద్ధిఖాకుతిజీ, సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో గేదె మృతి

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామానికి చెందిన దొంతుల సాయన్న తండ్రి పోశెట్టి గేదె బుధవారం రోజున కురిసిన గాలి వాన వర్షానికి కరెంటు తీగ తెగిపడి గేదె మృతి చెందింది. స్థానిక రైతులు మాట్లాడుతూ గాలివానతో కూడిన వర్షానికి కరెంటు తీగలు పడి గేదె మృతి చెంది, రైతు దొంతుల సాయన్నకు అపార నష్టం కలిగిందన్నారు. అధికారులు నాయకులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.

## మొక్కలు నాటిన భక్తులు



**ప్రజాపక్షం / లోకేశ్వరం :** బాగాపూర్ శివారులో గల నారాయణగుట్ట వద్ద నిర్జల ఏకాదశి సందర్భంగా భక్తులు లక్ష్మీ నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టన రోజు, పెళ్లిరోజు వేడుకలు చేసుకునే భక్తుల చేత మొక్కలు నాటే కార్యక్రమం ఆలయ అర్చకుడు నరసింహస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పుట్టిన రోజు, పెళ్లి రోజు జరుపుకునే వాళ్లు హిందూ సాంప్రదాయం ప్రకారం ఆలయానికి వెళ్లి పూజలు చేసి, ఆలయం వద్ద కావచ్చు ఇంటి వద్ద కావచ్చు ఒక మొక్కని నాటాలని ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు చెప్పి, భక్తుల చేత మొక్కలు నాటించారు. వర్షాలు సకాలంలో రావాలంటే చెట్లు అవసరమని నేడు మొక్కల్ని నాటితే పెరిగి చెట్లుగా మారుతాయని, వర్షాన్ని ఇస్తాయని వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## యువత ప్రాణాలు తీసుకోవద్దు

### ఎస్ఐ రాము



**ప్రజాపక్షం/మోర్తాడ్:** యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల మహమ్మారులకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మోర్తాడ్ ఎస్సై బి.రాము అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మన ఊరు–మన భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం మోర్తాడ్ ఎస్సై బి.రాము విద్యార్థులు, ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మహమ్మారుల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మోర్తాడ్ ఎస్సై బి.రాము పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం మత్తు పదార్థాల నష్టాలపై విద్యార్థులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మోర్తాడ్ సర్పంచ్ బోగ ఆనంద్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నా రు.

# వర్షాకాలం ముందస్తు చర్యలు ముమ్మరం

### మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్





**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మల్ పట్టణంలో ముందస్తు జాగ్రత్త చర్యలను మున్సిపల్ అధికారులు ముమ్మరం చేశారు. వర్షాల కారణంగా ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు, అసౌకర్యం తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని చిక్కడపల్లి, ఇందిరానగర్, గొల్లపేట్ తదితర ప్రాంతాల్లో మురికి కాలువల పూడికతీత పనులను వేగవంతం చేశారు. ఈ పనులను మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా, సజావుగా సాగిపోయేలా కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నారు. పట్టణ ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతపై మున్సిపాలిటీకి సహాకరించాలి. అప్పాల గణేష్ చక్రవర్తి మున్సిపల్ వైచైర్మెన్ కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూస్తున్నామని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు కూడా చేపడుతున్నామని అధికారులు వెల్లడించారు.

# ఎమ్మెల్యేకు 'రాజ్యాధికార సమరభేరి సభ' ఆహ్వాన పత్రిక



**ప్రజాపక్షం / భైంసా :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జులై 5వ తేదీన భువనగిరి జిల్లాలో నిర్వహించబోయే ప్రతిష్టాత్మక రాజ్యాధికార సమరభేరి సభకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కొమ్ముల ప్రవీణ్‌రాజ్ జిల్లా అధ్యక్షులు, గైని సాయి మోహన్ ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యేను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రకను సమర్పించారు. ఈ సందర్భంగా టిఆర్‌పి నాయకులు మాట్లాడుతూ, భువనగిరి జిల్లాలో జులై 5న జరగబోయే రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ సభకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ పవార్ రామారావు పటేల్ విచ్చేసి విజయవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెడ్‌లోడ్ శంకర్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి , పార్టీ ముఖ్య నాయకులు మారుతి పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణకు సహకరించాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ నిజామాబాద్ :** పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం అమలు చేస్తున్న ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు అందరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఎన్నికల సంఘం నిర్ధేశించిన షెడ్యూల్‌ను అనుసరిస్తూ ఎస్ఆర్ఐ ప్రక్రియ అమలులో భాగంగా బూత్ లెవల్ అధికారులు గురువారం నుండి ఇంటింటి సందర్శనకు శ్రీకారం చుట్టారు. జూలై 24 వరకు ఇంటింటి సర్వే కొనసాగనుంది. ఇందులో భాగంగా బిఎల్ఓ రుక్మిణి, సూపర్‌వైజర్ హరీష్ రెడ్డిలు గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠిని కలిసి ఎన్యుమరేషన్ ఫారాలు అందించారు. వీటిని పూరించి ఒక ఫారంను తిరిగి ఇవ్వాల్సిందిగా కోరారు. కలెక్టర్ నివాసాన్ని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారం అందించినట్లుగా ఆన్‌లైన్ ద్వారా బిఎల్ఓ మొబైల్ యాప్‌లో అప్‌డేట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియకు అందరూ సహకరించాలని కోరారు. ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం కరెక్ట్‌గా నింపేలా చూడాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఈ ప్రక్రియలో తహసీల్దార్ వినయ్‌సాగర్ పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** నిజామాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు, ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు డ్రగ్స్ రహిత గ్రామమనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి అవగాహన కల్పించినట్లు డిచ్‌పల్లి సిఐ వినోద్ వివరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శంకర్, సర్పంచ్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగేధర్పల్లి మండలంలోని హంసవాహిని పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించి యువత ఎలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా

**ప్రజాపక్షం/బోధన్:** ప్రైవేట్ స్కూళ్లలో బుక్కులను అమ్మడంపై ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లగా నాకు దీనిపై ఎలాంటి అవగాహన లేదనడాన్ని నిరసిస్తూ తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు గురువారం నిజామాబాద్ జిల్లా బోధన్ ఎంఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేష్ మాట్లాడుతూ.. దాదాపు వారం రోజుల నుంచి ప్రైవేట్ స్కూళ్లలో విచ్చలవిడిగా బుక్స్ అమ్ముతున్నారనే న్యూస్ రావడంతో స్కూళ్లను పరిశీలించామన్నారు. అక్కడ బుక్స్ అమ్మడంపై ఎంఇఒకు తెలియచేయగా నాకు అవగాహన లేదనడం సరికాదన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో బుక్స్ అమ్మడంపై చర్యలు తీసుకోని ఎడల డీఈఓ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. దీనిపై విద్యశాఖ అధికారులు స్పందించకుంటే మరింత ఉధృతంగా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నిఖిల్, పట్టణ కార్యదర్శి వీరేష్, రాజ్ రతన్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్మల్ శ్రీనగర్ కాలనీలో మున్సిపల్ డిఇ పర్యవేక్షణ



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ కేంద్రంలోని శ్రీనగర్, శాస్త్రినగర్ కాలనీలో నిర్మల్ మున్సిపల్ డీ.ఈ. స్వయంగా వార్డులో డ్రైనేజీ వ్యవస్థను పర్యవేక్షించారు. వర్షాధార నీటిని డ్రైనేజీలకు మళ్ళించాలని కాలనీవాసులకు పలు సూచనలు చేశారు. రాబోయే వర్షాకాలం డ్రైనేజీ వ్యవస్థను శుభ్రంగా ఉంచుకోవాలని వర్షాకాలంలో కాలనీవాసులు ఏలాంటి వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రతగా ఉండాలని, చెత్తా చెదారం ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. శ్రీనగర్ కాలనీ కౌన్సిలర్ ధర్మాజిగారి రమ్య ఈశ్వర్, మున్సిపల్ డీ.ఈ. పర్యవక్షణ, కానీ కాలనీ సమస్యలు విన్నవించడం జరిగిందని స్వయంగా పర్యవేక్షించారని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్:** గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు దాసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని తొర్లికొండలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సఫాయి కార్మికులను పర్మినెంట్ చేస్తామని మాటనిచ్చి నేటికి అమలు చేయకపోవటం శోచనీయమన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఉండాలంటూ కేవలం రూ.9500 ఇచ్చి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు మరణశాసనం విధిస్తోందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల అమలు సాధ్యం కాదని, శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ పంపాలని దాసు సిఎంను కోరారు. కార్యక్రమంలో నాయకులు భానుచందర్, రాజన్న ,చిట్టిబాబు, గంగాధర్, సంతోష్, నాగవ్వ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## 28న పల్స్‌పోలియో : ఎంపిడిఒ

**ప్రజాపక్షం/ భీమ్‌గల్:** మండలంలో ఈనెల 28న 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాక్సిన్ మండలంలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలో నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మెడికల్ ఆఫీసర్ అజయ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పల్స్‌పోలియోపై మండల స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో 28న పోలియో డేగా గుర్తిస్తూ ఐదేళ్ల లోపు పిల్లలకు చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అజయ్, ఎస్సై, ఐసీడీఎస్ సిబ్బంది, హెల్త్ సిబ్బంది నాయకులు స్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

## యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడొద్దు: ఎస్ఐ సుహాసిని

**ప్రజాపక్షం/ ముప్కాల్ :** మన ఊరు మన భద్రతలో భాగంగా గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో మెండోరా ఎస్ఐ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పోచంపాడ్ ఎక్స్ రోడ్డు వద్ద పెద్దసంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మహమ్మారుల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని గ్రామస్తులకు, విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారముంటే పోలీసులకు తెలపాలని సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం మత్తు పదార్థాల నష్టాలపై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవన నిర్మాణానికి భూదానం



ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి మహిళా సంఘ భవనాలు మంజూరు చేయగా నాగారం గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడాన్ని గుర్తించి గ్రామ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, గ్రామస్తుల కోరిక మేరకు గ్రామానికి చెందిన జిల్లా ఉత్తమ రైతు అవార్డు గ్రహీత గడ్డం సత్య నారాయణ రెడ్డి తన స్వంత భూమిలో మహిళ సంఘ భవనానికి సరిపడా స్థలాన్ని విరాళంగా అందించి ఆదర్శంగా నిలిచారు.ధర్మపురి మండలం నాగారం కు చెందిన గడ్డం సత్యనారాయణరెడ్డి సీనియర్ న్యాయవాదిగా అందరికీ సూపరిచితులు.అంతేకాక జిల్లా ఉత్తమ రైతుగా గతంలో పురస్కారం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు సామాజిక బాధ్యతతో ఉంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గతంలో నాగారం గ్రామ పంచాయతీకి సైతం తాను భూమిని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భూవిరాళం చేసిన సత్యనారాయణ రెడ్డిని సర్పంచ్ చిలుముల లక్ష్మణ్ పాలకవర్గం ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో భూదాత సత్యనారాయణ రెడ్డి, నాగారం, దోనూర్ గ్రామాల సర్పంచులు చిలుముల లక్ష్మణ్,దాసరి పురుషోత్తం,తాళ్ళపెల్లి మల్లేష్, సురకంటి చుక్కరెడ్డి,గడ్డం అఖిల్ రెడ్డి,వెల్గొండ వెంకటేష్,పంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'సర్' సర్వేకు సహకారం అందించాలి



ప్రజాపక్షం /మల్లాపూర్ : భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ సర్వేకు గ్రామంలో ప్రతి ఒక్కరు బిఎల్ఓ లకు సహకరించాలని సర్పంచ్ దప్పుల పద్మ అన్నారు. ఈ సందర్భం గా గురువారం ఇంటింటి సర్వేలో భాగంగా నమోదు పత్రాలను అందించి సర్వేను ప్రారంభించారు.వివరాలు సేకరించే క్రమంలో అవసరమైన ఫోటోలు సంబంధిత పత్రాలు సిద్ధంగా ఉంచుకొని సర్వే సహకరించాలని గ్రామస్తులను కోరారు. వీరి వెంట బిఎల్వోలు తదితరులున్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ



ప్రజాపక్షం / సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో గురువారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సర్పంచ్ కొలపాక రాధ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్, బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఫారాలను పంపిణీ చేసి, వివరాలు నమోదు, ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిపివో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, అంగన్వాడీ టీచర్స్ నర్సమ్మ, మీనా, నాయకులు ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

యువత భవిష్యత్తును కాపాడేందుకు
తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
ఈగిల్ టీమ్‌తో పోలీసుల ప్రత్యేక నిఘా
సిఐ సురేష్ బాబు



ప్రజాపక్షం /మెట్‌పల్లి : పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించి, వారు ఎలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారో ఎ ప్పటిక ప్పుడు గమనించాలని మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు సూచించారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కొంతమంది యువత వివిధ రకాల మత్తు పదార్థాలకు బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువతను ఉన్నత లక్ష్యాల సాధనకు దూరం చేస్తోందని అన్నారు. పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు, వారి రోజువారీ అలవాట్లు ఎలా ఉన్నాయనే విషయాలను తల్లిదండ్రులు గమనిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.గంజాయి వ్యసనం కారణంగా రేపటి యువత నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి యువతను సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.గంజాయి రవాణా, విక్రయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయిని పూర్తిగా నిర్మూలించినప్పుడే యువతకు సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని అన్నారు. గంజాయి నియంత్రణ కోసం పోలీసు శాఖ ప్రత్యేకంగా ఈగిల్ టీమ్‌ను ఏర్పాటు చేసి నిఘా చర్యలను ముమ్మరం చేసిందని సీఐ సురేష్ బాబు తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

## బిజెపి జగిత్యాల అర్బన్ మండల ఉపాధ్యక్షుడిగా బింగిశెట్టి తిరుపతి



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : భారతీయ జనతా పార్టీ జగిత్యాల అర్బన్ మండల ఉపాధ్యక్షుడిగా ధరూర్ గ్రామానికి చెందిన బింగిశెట్టి తిరుపతిని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు జగిత్యాల అర్బన్ మండల అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి అధికారిక నియామక పత్రాన్ని విడుదల చేశారు.ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.బింగిశెట్టి తిరుపతి నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బింగిశెట్టి తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జగిత్యాల అర్బన్ మండల ఉపాధ్యక్ష బాధ్యతలను అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం పనిచేస్తానని ఆయన అన్నారు.అలాగే మండల పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయానికి తన వంతు కృషి చేస్తానని బింగిశెట్టి తిరుపతి పేర్కొన్నారు.బింగిశెట్టి తిరుపతి నియామకంపై పార్టీ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ నియామకం ద్వారా జగిత్యాల అర్బన్ మండలంలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



ప్రజాపక్షం / సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి మాతా గోవిందాంబ కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు మంగళహారతులు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు మహాఅన్నదానం కార్యక్రమం నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సొల్లు సురేందర్, ఉప సర్పంచ్ కొండ మురళి, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రంగా సాగర్‌లో పశువైద్య శిబిరం

ప్రజాపక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బీర్పూర్ మండలం రంగాసాగర్ గ్రామంలో నాలుగు నెలల వయస్సు దాటిన అన్ని తెల్ల జాతి పశువులకు (ఆవులు, ఎద్దులు, లేగ దూడలు) లంపీ స్కిన్ డిసీజ్ ముద్ద చర్మ వ్యాధి యొక్క నివారణ టీకాలు వేయడం జరిగింది. డాక్టర్ .జె. సునీల్ మాట్లాడుతూ టీకాల యొక్క ఆవశ్యకత, ఈ టీకా వేయడం ద్వారా తెల్ల పశువులలో ముద్ద చర్మవ్యాధి రాకుండా అరికట్టడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోడ సాగర్, ఉప సర్పంచ్,గ్రామ కార్యదర్శి , గ్రామ రైతులు తుంగూర్ ప్రాథమిక పశు వైద్య కేంద్రం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డా.జె.సునీల్ మరియు లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎం.గణేష్, సిబ్బంది యు. సతీష్, గోపాలమిత్ర అరుణ్, సాయి కుమార్, రైతులు పాల్గొన్నారు.

# యువత విద్య, పరిశోధన, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలి

పొలాస వ్యవసాయ కళాశాలలో
మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాల, పొలాస, జగిత్యాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కింద జగిత్యాల జిల్లా పోలీసు శాఖ,జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డా.జె.సురేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా జగిత్యాల రూరల్ సీఐ డి.సుధాకర్, జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమా సాగర్ పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగిత్యాల రూరల్ సీఐ డి.సుధాకర్, జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమా సాగర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, పరిశోధన, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని వారు సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యక్రమాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. అసోసియేట్ డీన్ డా.జె.సురేష్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థి "సే నో టు డ్రగ్స్ సే ఎస్ టు లైఫ్" అనే సందేశాన్ని ఆచరణలో పెట్టి మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ముగింపులో విద్యార్థులందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం నషా ముక్త్ భారత్ నిర్మాణానికి కృషి చేస్తాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డా. వి.రత్నాకర్, ఒఐఎస్ఎ వ్యవసాయ కళాశాల, డా. కె. రాజేంద్ర ప్రసాద్, ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమ అధికారి, డా. అర్చన, ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమ అధికారి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత ఛాతీ ఎక్స్-రే శిబిరం

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామ పంచాయతీ ఆవరణంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉచిత ఛాతీ ఎక్స్‌రే శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కవితకిషన్ రెడ్డి కోరారు.ఈ ఎక్స్‌రే వైద్య శిబిరానికి పాల్గొనేవారు 30 సంవత్సరాల నుండి 100 సంవత్సరాల లోపు ఉన్న అందరికీ ఎక్స్‌రే తీయడం జరుగుతుందని,ఈ శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డ్,సెల్ నంబర్ తీసుకురావాలని,ఈ అవకాశాన్ని గ్రామస్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కవితకిషన్ రెడ్డి కోరారు.

## డ్రగ్స్‌పై అవగాహన సదస్సు



ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జి. నవీన్ కుమార్, ప్రిన్సిపల్ సంజీవ్, కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులున్నారు.

## తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు పూర్తి

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామం నుండి కాల్వపల్లి వెళ్లే మార్గంలో మానేరు వాగుపై ఇటీవల కాంట్రాక్టర్ తాత్కాలిక మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు.అయితే, రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మానేరు నదిలో వరద ఉధృతికి తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయింది.దీంతో రెండు జిల్లాల మధ్య ప్రయాణాలు పూర్తిగా నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.రోడ్డు తెగిపోయిన విషయాన్ని గమనించిన కాంట్రాక్టర్ వెంటనే స్పందించి మళ్లీ మట్టిని పోయించి,రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేశారు.వాహనదారులు ఉపశమనం పొందారు.